

పోలీస్ స్టేషన్లో నగదు అప్పగింత

నిజాయతీ చాటుకున్న ప్రభురాజు, రామాంజనేయులు

తణుకు రూరల్: కారులో వెళ్తుండగా తణుకు పట్టణ పరిధిలో రాష్ట్రీయ రహదారిపై దొరికిన నగదును తణుకు పోలీస్ స్టేషన్లో అప్పగించి తమ నిజాయతీని చాటుకున్నారు. పెనుగొండ గ్రామానికి చెందిన బాలం ప్రభురాజు, దంపనబోయిన రామాంజనేయులు సోమవారం మధ్యాహ్నం రాష్ట్రపతి రోడ్లో ప్రయాణిస్తుండగా ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఒక గుర్తుతెలియని వ్యక్తి బ్యాగ్‌లో నుంచి మూడు నోట్ల కట్టలు జారిపోవడం గమనించారు. కారు కావడంతో ట్రాఫిక్‌లో బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని వెంబడించలేని పరిస్థితి దీంతో దొరికిన నగదును పోలీస్ స్టేషన్లో అప్పగించారు. పోలీసులు నగదును లెక్కించగా రూ.1,18760 ఉన్నట్టు గుర్తించారు. నిజాయతీగా దొరికిన అతను పోలీసులకు అప్పగించినందుకు వారిని అభినందించారు. నగదు పోగొట్టుకున్న వ్యక్తిని గుర్తించి అప్పగిస్తామని తెలిపారు.

విద్యుత్ భారాలు వద్దే వద్దు..

'పెంచిన విద్యుత్ భారాలను ఉపసంహరించి ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమలు చేయండి.. స్మార్ట్ మీటర్లను తక్షణం ఆపి ఇచ్చిన మాట నిలబెట్టుకోండి.. అదానీ కంపెనీలతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేసి ప్రజలపై భారాల మోత ఆపండి.. లేనిపక్షంలో రానున్న రోజుల్లో మరోసారి విద్యుత్ ఉద్యమం తప్పదు' అంటూ సిపిఎం శ్రేణులు పెద్దఎత్తున నినదిస్తూ భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు వేసి నిరసన తెలిపారు. వాడవాడలా భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు వేసి సిపిఎం నిరసన తెలపడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఆయా ప్రాంత ప్రజలు, ప్రధానంగా మహిళలు స్వచ్ఛందంగా ఈ కార్యక్రమాల్లో పాల్గొనడం విద్యుత్ భారాలపై ప్రజల్లో నెలకొన్న అసంతృప్తికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు.



భీమవరంలో భోగిమంట వద్ద నిరసన తెలియజేస్తున్న సిపిఎం నేతలు

సిపిఎం ఆధ్వర్యాన భోగి మంటల్లో బిల్లులు దహనం

ప్రజాశక్తి - భీమవరం

తాము అధికారంలోకి వస్తే ఎటువంటి విద్యుత్ భారాలు మోపబోమని చెప్పిన కూటమి అధికారంలోకి రాగానే మోయలేని విధంగా భారాలు మోపడం దారుణమని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ విమర్శించారు. ప్రజలపై భారాలు వేయడమే ప్రభుత్వ విధానమా అని ప్రశ్నించారు. సోమవారం సిపిఎం ఆధ్వర్యాన పట్టణంలో మారుతీనగర్, మెంటేవారితోటల్లో భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు వేసి దగ్ధం చేశారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ భోగి మంటలు అంటే పాత వస్తువులను మంటల్లో వేయడం ఆచారంగా వస్తుందన్నారు. ప్రభుత్వం గతంలో వినియోగించుకున్న దానికి ప్రస్తుతం బిల్లుల వసూలు చేసే ప్రయత్నం ఏదైతే ఉందో దాన్ని భోగి మంటల్లో వేస్తున్నామన్నారు. ప్రభుత్వం వెంటనే పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల ఒప్పందం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వినియోగదారుల ప్రయోజనాలను గాలికొదిలేసి డిస్కమ్‌లు పెట్టే తప్పుడు ప్రతిపాదనలను నియంత్రణా మండలిగాని, రాష్ట్ర ప్రభుత్వంగాని ఆమోదించడమంటే పాలకులు ఎవరి పక్షాన ఉన్నారో తెలుస్తున్నదన్నారు. అదానీతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ, కె.క్రాంతిబాబు, నాయకులు ఆకుల హరేరాం, మల్లిపూడి ఆంజనేయులు, జి.రఫాయేలు, కె.రత్నకుమారి, ఎం.లత పాల్గొన్నారు.

పాలకోడేరు: అడ్డగోలుగా విద్యుత్ ఒప్పందాలను చేసుకుని అవినీతికి పాల్పడి దానిని కప్పి పుచ్చుకునేందుకు ప్రజలపై భారాలను మోపడం సరైంది కాదని, తక్షణం విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బి.బలరాం డిమాండ్ చేశారు. విస్సాకోడేరులో సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించిన భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు రెడ్‌కార్పెట్ వేసి పేద నెత్తిన భారాలు మోపుతుందని విమర్శించారు. రాబోయే రోజుల్లో మరిన్ని భారాలు వేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు ఉన్నాయన్నారు. వీటిని తిప్పికొట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. స్మార్ట్ మీటర్లు బిగిస్తే భవిష్యత్తులో అనేక ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడతాయన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి శేషాపు అక్కియ్య, నాయకులు కలిదిండి గోపాలరాజు, పృథ్వీరాజు, సత్యనారాయణ, స్థానికులు పాల్గొన్నారు.

వీరవాసరం: విద్యుత్ ఛార్జీలు పెంచబోమని కూటమి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని తుంగలోకి తొక్కి ప్రజలపై విద్యుత్ భారాలు మోపడాన్ని వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యాన సోమవారం నిరసన తెలిపారు. పెర్కిపాలెం, వీరవాసరం, మత్స్యపురి, ఉత్తరపాలెం గ్రామాల్లో విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నేత జుత్తిగ నరసింహమూర్తి, మండల కార్యదర్శి బొర్రా అలమాహరాజు, నేతలు బాలం విజయకుమార్, యండమూరి సుబ్బారావు, రెడ్డి రామారావు, బొబ్బనపల్లి సూర్యచంద్రరావు, ప్రజలు పాల్గొన్నారు.

పెనుమంట్ర: విద్యుత్ భారాలను వెంటనే ఉపసంహరించాలని సిపిఎం మండల కార్యదర్శి కోడే శ్రీనివాస ప్రసాద్ అన్నారు. బ్రాహ్మణచెరువులో భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను వేసి దగ్ధం చేశారు. కార్యక్రమంలో నేతలు చింతపల్లి లక్ష్మణరావు, మారాసు లక్ష్మణరావు, బి.భాస్కరరావు, కముజు కృష్ణ, శీలం శ్రీను, రొక్కాల శ్రీను, చిన్నబ్బులు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆచంట: విద్యుత్ భారాలను ఉపసంహరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన భోగిమంటల్లో విద్యుత్ బిల్లులు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి పి.మోహన్‌రావు మాట్లాడారు. నేతలు కుసుమే జయరాజు, తెలుపూరి బుజ్జబ్బాయి, బండి రంగారావు, నెక్కంటి కృష్ణమూర్తి, నెక్కంటి వీరబ్రహ్మం, సత్యనారాయణ, రాంబాబు పాల్గొన్నారు.

ఆకివీడు: విద్యుత్ భారాలను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యాన విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేసి నిరసన తెలిపారు. బొక్కా వారి వీధి, సావిత్రమ్మ వీధి, రైల్వే స్టేషన్ వద్ద ఈ నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో బొక్కా సత్యనారాయణ, పెంకి అప్పారావు, రాంబాబు, దొక్కా రవి తదితరులు పాల్గొన్నారు.

కాళ్ల: విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యాన మండలంలోని కాళ్ల, జువ్వలపాలెం, ఎల్‌ఎన్‌పురం, గోగుపర్రు, ప్రోత్తాయేరక గ్రామాల్లో భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు వేసి దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ మాట్లాడగా నేతలు మండా సూరిబాబు, తిరుమాని శ్రీను, తానుకొండ వెంకటేశ్వరరావు, నాగిడి ఆంజనేయులు, గండికోట వెంకటేశ్వరరావు, ప్రజలు పాల్గొన్నారు.


వీరవాసరంలో..

తాడేపల్లిగూడెం: తాము అధికారంలోకి వస్తే ధరలను నియంత్రిస్తామని, స్మార్ట్ మీటర్లు, సర్దుబాటు, ట్రూఅప్ ఛార్జీలు రద్దు చేస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి అధికారంలోకి వచ్చిన ఏడు నెలల కాలంలోనే కరెంట్ ఛార్జీలు విపరీతంగా పెంచిందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు విమర్శించారు. సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక బ్రహ్మానందరెడ్డి మార్కెట్ వద్ద భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు వేసి దగ్ధం చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ అదానీతో గత ప్రభుత్వం ఒప్పందం చేసుకుంటే కూటమి ప్రభుత్వం రద్దు చేయాల్సిందిపోయి అదే ఒప్పందాన్ని తిరిగి అమలు చేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. విద్యుత్ భారాలను ఉపసంహరించని పక్షంలో దశలవారీగా ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, నేతలు జవ్వాది శ్రీను, దేశంశెట్టి సతీష్, పుట్టా ఏసు, కాయల ప్రసాద్, మద్దూరి ఆనంద్, కార్యకర్తలు, కార్మికులు పాల్గొన్నారు.


తణుకులో..

తాడేపల్లిగూడెం మండలం నవాబుపాలెం అంబేద్కర్, బాబూజగజీవన్‌రావ్ సెంటర్లో సిపిఎం ఆధ్వర్యంలో భోగిమంటల్లో విద్యుత్ బిల్లులు వేసి దగ్ధం చేశారు. ఈ సందర్భంగా నాయకులు కండెల్లి సోమరాజు మాట్లాడగా విజయ, అనూష, రమేష్, జయ, రాహేలమ్మ, కుమారి, ధనమ్మ, సూర్యచంద్రం పాల్గొన్నారు.


పెంటపాడులో..

తాడేపల్లిగూడెం వీకర్స్ కాలనీలో విద్యుత్ బిల్లులు భోగి మంటల్లో వేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

గణపవరం: విద్యుత్ భారాలు ఉపసంహరించాలని కోరుతూ కేశవరంలోని ఉద్దరాజు రామం నగర్‌లో సిపిఎం ఆధ్వర్యాన భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ స్మార్ట్‌మీటర్లు, సర్దుబాటు ఛార్జీలను ఉపసంహరించుకోకపోతే 2000వ సంవత్సరంలో జరిగిన విద్యుత్ పోరాటం పునరావృతమవుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి పెచ్చెట్టి నరసింహమూర్తి మాట్లాడగా పెచ్చెట్టి లక్ష్మి, కట్టా సత్యవతి, కోడి సత్యనారాయణ, వీరవల్లి గంగారత్నం తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండ: సిపిఎం ఆధ్వర్యాన మండలంలో పెనుగొండ, వడలి, సిద్ధాంతం, చినమల్లం, తామరాడ, సోమరాజు చెరువు గ్రామాలు, సిద్ధాంతం కరెంట్ ఆఫీస్ కాలనీలో విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి షేక్ పాదుషా మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, పద్మ తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలి: ట్రూఅప్ ఛార్జీలు, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని కోరుతూ మండలంలోని చించినాడ, కలగంపూడి, ఏనుగువానిలంక, యలమంచిలి, కట్టుపాలెం, దొడ్డిపట్ల, గుంపర్రు తదితర గ్రామాల్లో సిపిఎం ఆధ్వర్యాన భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు వేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమాల్లో సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు, నేతలు బాతిరెడ్డి జార్జి, దేవ సుధాకర్, పల్లి జార్జిబాబు, శెట్టిమి భాస్కర్‌రావు, ముస్కాడి జయశ్రీ, శెట్టిమి నాగమణి, మల్లుల పుల్లారావు, చింతపల్లి కొండ పాల్గొన్నారు.

భీమవరం టౌన్: రూరల్ మండలంలోని వెంప, శ్రీరామపురం, తోకతిప్ప గ్రామాల్లో సిపిఎం ఆధ్వర్యాన విద్యుత్ బిల్లులు భోగి మంటల్లో వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమాల్లో బొడ్డు లక్ష్మీపతి, తిరుమాని నాగేశ్వరరావు, పొన్నమండ నాగేశ్వరరావు, భూపతి శామ్యేలు, ఈదా భూషణం గుత్తుల నాగమణి, మంద మార్తమ్మ, మంద శిరోమణి, గూడూరి సత్య పూర్ణిమ, తెన్నేటి పెద్దిరాజు, వెంకటేష్, మంద నరేష్ పాల్గొన్నారు.

పాలకొల్లు: ట్రూఅప్ ఛార్జీల పేరుతో ప్రజలపై విద్యుత్ భారాలు వేయడాన్ని వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యాన వీకర్స్‌కాలనీలో భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు వేసి దగ్ధం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంఎల్‌ఎ దిగుపాటి రాజగోపాల్ మాట్లాడుతూ కూటమి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్, నేతలు చల్లా సోమేశ్వరరావు, గుబ్బల సత్యనారాయణ, వై.అజయ్‌కుమార్, టి.శ్రీనివాసరావు, ఎ.శ్రీనివాస్, శంకరం, వీరభద్రం, పోతురాజు పాల్గొన్నారు.

నరసాపురం: విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో నరసాపురం పట్టణంలోని 25వ వార్డు ఆదర్శనగర్ కాలనీలో విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కౌరు పెద్దిరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.15 వేల కోట్లు విద్యుత్ భారాలను ప్రజలపై మోపిందని విమర్శించారు. అదానీ కంపెనీతో చేసుకున్న అన్ని రకాల ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కడలి బేబీ, పాలా జ్యోతి, ఎడ్లపల్లి ఝాన్సీరాణి, విజయలక్ష్మి, హైమావతి, సరోజిని, లక్ష్మి, సుధారాణి పాల్గొన్నారు.

మండలంలోని ఎల్‌బిచర్లలో భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు వేసి దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి జల్లి రామ్మోహన్‌రావు మాట్లాడారు.

పెంటపాడు: సిపిఎం ఆధ్వర్యాన స్థానికంగా భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను వేసి దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు, మండల కన్వీనర్ సిరపరపు రంగారావు, నేత చిర్ల పుల్లారెడ్డి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బంకురు నాగేశ్వరరావు, మీసాల శ్రీను, పెనగంటి దుర్గా, చిర్ల సత్యనారాయణరెడ్డి, సత్తి కనికిరెడ్డి, వెలగల సాయిమణికంఠరెడ్డి, చిర్ల రోహిత్‌రెడ్డి, మురుపో జాన్‌రాజు పాల్గొన్నారు.

తణుకు: కూటమి ప్రభుత్వం పెంచిన కరెంట్ ఛార్జీలు వెంటనే తగ్గించాలని, మళ్లీ పెంచాలనే ఆలోచన మానుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి.ప్రతాప్ డిమాండ్ చేశారు. పట్టణంలోని పలు వార్డుల్లో సిపిఎం ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులు భోగి మంటల్లో వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రతాప్, పట్టణ కార్యదర్శి అజయకుమారి మాట్లాడుతూ ప్రజల జీవన పరిస్థితులు పట్టించుకోకుండా అధికారంలోకి ఎవరు వచ్చినా బాదుడేనన్నారు. అదానీతో చేసుకున్న ఒప్పందాలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గార రంగారావు, రాము, రాధాకృష్ణ, సూర్యనారాయణ, మోహన్, నిఖిల్ తేజ్, అనురాధ, చిట్టెమ్మ, అన్నపూర్ణ, లక్ష్మీదేవి, గుబ్బల గోపీ, ఎన్.ఆదినారాయణబాబు, అనంతలక్ష్మి, గార వెంకాయమ్మ పాల్గొన్నారు.

ఇరగవరం: పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని సిపిఎం మండల కమిటీ కన్వీనర్ కామన మునిస్వామి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో కరెంటు బిల్లులను భోగి మంటల్లో వేసి దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడారు. కార్యక్రమంలో జుత్తిగ రామాంజనేయులు, పాలా సత్యనారాయణ, పిల్లి ఏడుకొండలు, పెచ్చెట్టి నాగేశ్వరరావు, వీరవల్లి శ్రీను, శివయ్య, జక్కంశెట్టి గంగాధర్ పాల్గొన్నారు.

మొగల్తూరు: విద్యుత్ భారాలను వెంటనే తగ్గించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన బుధవారం సాయంత్రం భోగి మంటలు వేసి విద్యుత్ బిల్లులను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమాన్నుద్దేశించి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో వీరా పాండురంగారావు, జట్టు కార్మికులు పాల్గొన్నారు.

ఉండి: సిపిఎం ఆధ్వర్యాన మండలంలోని చెరుకువాడలో భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు వేసి దహనం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి చీర్ల శేషు మాట్లాడారు.


తాడేపల్లిగూడెంలో


నరసాపురంలో..


పాలకొల్లులో..


తణుకు రూరల్ మండలం తేతలిలో పందేల బరి వద్ద వాహనాల రద్దీ

కో'ఢీ'..!

పందెంరాయుళ్లదే పైచేయి
పత్తాలేని అధికారగణం
ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో తొలి రోజు 400 బరుల్లో పందేలు
కూటమి, వైసిపి పోటాపోటీగా బరుల ఏర్పాటు
పెదఅమిరంలో పందేలను ప్రారంభించిన డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, మాజీ మంత్రి గంటా శ్రీనివాస్
వైసిపి బరులను అడ్డుకుంటున్నారంటూ పోలీసులపై మాజీ మంత్రి కారుమూరి ఆగ్రహం
యథేచ్ఛగా గుండాట, ఏరులై పారిన మద్యం

సంక్రాంతి సంప్రదాయం మాటున ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో కోడి పందేలు సోమవారం పెద్దఎత్తున ప్రారంభమయ్యాయి. రెండు జిల్లాల్లోనూ తొలి రోజు 400 బరుల్లో పందేలు సాగగా రూ.60 కోట్లకుపైగా నగదు చేతులు మారింది. బరుల వద్ద పేకాట, గుండాట జోరు కొనసాగింది. మద్యం ఏరులై పారింది. పశ్చిమగోదావరి జిల్లాలో టిడిపి, బిజెపి, జనసేన, బిజెపి నాయకులు పోటాపోటీగా కోడి పందేల బరులు ఏర్పాటు చేయడం గమనార్హం. మంగళ, బుధవారాల్లో పందేల జోరు మరింత పెరగనున్నట్లు పందెంరాయుళ్లు చెబుతున్నారు. ప్రధాన రహదారులకు ఆనుకుని పందాలు సాగుతున్నా పోలీసులు అటువైపు కన్నెత్తి చూడని పరిస్థితి ఉంది. కాళ్ల మండలం పెదఅమిరంలో సాగిన బరి రెండు జిల్లాల్లోనే అతిపెద్దదిగా చెబుతున్నారు. డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్‌ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు, మాజీ మంత్రి గంటా శ్రీనివాస్ పందేలను ప్రారంభించారు. పశ్చిమగోదావరి జిల్లా కేంద్రమైన భీమవరం శివార్లలో గొల్లలకోడేరులోని ఎస్‌పి కార్యాలయానికి వెళ్లే దారిలోనే కోడి పందేల బరి ఏర్పాటు చేసి నిర్వహించడం గమనార్హం. వీరవాసరం మండలంలో కొన్ని కోడి పందేల బరుల వద్ద గెలుపొందిన వారికి వినూత్న బహుమతులు ప్రకటించారు. పందెంరాయుళ్లను ఆకర్షించేందుకు ఏకంగా బుల్లెట్ వాహనాలు, యూనికార్న్ వాహనాలు బహుమతులు ఏర్పాటు చేశారు. కోడి పుంజులు తెచ్చుకున్న పందెంరాయుళ్ల రూ.లక్ష చొప్పున 12 పందేలు కాయాలి. అంటే రూ.12 లక్షలు, 12 పుంజులు లెక్క. ఈ 12 పందేల్లో ఆరు పందేలు గెలిస్తే వారికి బుల్లెట్ బండి లేదా యూనికార్న్ మోటారు సైకిల్ బహుమతిగా ఇవ్వనున్నారు. అలాగే మరో బరిలో పందేలు ఎక్కువగా గెలిచిన వారికి 8 గ్రాములు, 4 గ్రాములు బంగారు కాయిన్స్ కూడా ప్రకటించారు. పాలకోడేరు మండలం శృంగవృక్షంలోనూ ఈ పరిస్థితి ఉంది. ఒక బరిలో రెండు బుల్లెట్లు, రెండు యాక్టివాలు సిద్ధం చేశారు. భీమవరం మండలం తాడేరులో నిర్వహించిన పందేల్లో జబర్దస్త్ నటులు పాల్గొని సందడి చేశారు. తణుకు నియోజకవర్గంలో వైసిపి నేతల బరులను పోలీసులు అడ్డుకుంటున్నారంటూ మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఇరగవరం మండలం కొత్తపాడులో రోడ్డుపై బైఠాయించడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. పందేలను అడ్డుకుంటామంటూ నిన్నటి వరకూ బీరాలు పలికిన పోలీసులు మామూళ్ల మత్తులో జోగుతున్నారనే విమర్శలు వెల్లువెత్తాయి. భోగి రోజు రెండు జిల్లాల్లోనూ యథేచ్ఛగా పందేలు సాగినా అటువైపు కన్నెత్తి చూడని పరిస్థితి. బరుల ప్రాతిపదికన మామూళ్లు వసూలు చేసి వాటాలు పంచుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఏలూరు జిల్లాలో ముదినేపల్లి మండలం బొమ్మినంపాడులో పెద్దబరి వద్ద గలాటా నెలకొంది. అక్కడికెళ్లిన పోలీసులపైనే పందెంరాయుళ్లు ఎదురు తిరిగినట్లు సమాచారం. ఉంగుటూరు మండలం నారాయణపురంలో కోడిపందేలను జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ ప్రారంభించడం విశేషం. ముదినేపల్లిలో తహశీల్దార్ కార్యాలయం వెనుకే పందేలు నిర్వహించడం గమనార్హం.

వార్త 6లో

పోరాటంతోటే మినీ స్టేడియం సమస్య పరిష్కారం

డివైఎఫ్‌ఐ క్రీడా పోటీల ప్రారంభ సభలో వక్తలు

ప్రజాశక్తి - ఆకివీడు

దశాబ్దాలుగా ఉన్న ఆకివీడు మినీ స్టేడియం సమస్య పరిష్కారానికి పోరాటమే పరిష్కారమని, అందుకు ప్రతి ఒక్కరూ కదలి రావాలని వక్తలు సంయుక్తంగా పిలుపునిచ్చారు. డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక జెడ్‌పి హైస్కూల్ గ్రౌండ్లో సుందరయ్య క్రీడా ప్రాంగణంలో నిర్వహించే 42వ సంక్రాంతి యువజనోత్సవాల ముఖద్వారాన్ని ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు డాక్టర్ పిబి.ప్రతాప్ కుమార్, సుందరయ్య క్రీడా ప్రాంగణాన్ని సంఘం అధ్యక్షులు మొహమ్మద్ మదనీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మదని అధ్యక్షతన సభ జరిగింది. అనంతరం మదనీ మాట్లాడుతూ సుమారు 42 సంవత్సరాలుగా డివైఎఫ్ఐతో కలిసి పయనిస్తూ క్రీడా ప్రాంగణాన్ని కోరుతూనే ఉన్నామని, అయినా ఏ ఒక్కరూ నిర్మాణానికి పూనుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. యువత క్రీడల ప్రోత్సాహానికి ఎంతగానో ప్రయత్నిస్తున్నారని వారి ప్రయత్నానికి అధికారులు కలిసి రావాలని ఆయన కోరారు. సభలో వైసిపి నాయకులు అంబటి రమేష్, వినియోగదారుల సంఘాల రాష్ట్ర సమాఖ్య సహాధ్యక్షులు బొబ్బిలి బంగారయ్య, డివి రమణమూర్తి మాట్లాడుతూ మినీ స్టేడియం కోసం ఉద్యమించాల్సిందేనన్నారు. అందుకోసం రాస్తారోకోలు, ధర్నాలకు ముందుకెళ్దామన్నారు. డివైఎఫ్ఐ మాజీ అధ్యక్షులు బొక్కా సత్యనారాయణ మాట్లాడుతూ మాదకద్రవ్యాలను ప్రతి ఒక్కరూ తరిమికొట్టాలన్నారు. ఆహ్వాన సంఘం కన్వీనర్ డి.రవితేజ మాట్లాడుతూ క్రీడల పట్ల ప్రభుత్వానికి లక్ష్యం తగ్గిందన్నారు. విదేశీ సంస్కృతి పట్ల మోజు పెరుగుతోందని వాపోయారు. ఆహ్వాన సంఘ కోశాధికారి బొట్టుపల్లి రాంబాబు మాట్లాడుతూ హైకోర్టు ఉత్తర్వులను బేఖాతరు చేసి పేకాట, కోడిపందేలు, జూదాలు యథేచ్ఛగా సాగిస్తున్నారని తెలిపారు. ముందుగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గేదెల ధనుష్ పతాకావిష్కరణతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. సోమవారం పోటీలు లాంఛనంగా ప్రారంభమయ్యాయి.


పాటల పోటీని ప్రారంభిస్తున్న ప్రతాప్‌కుమార్


అల్లూరి సీతారామరాజు స్మృతి వనానికి నూతన శోభ

మ్యూజిక్ వాటర్ ఫౌంటెన్‌ను ప్రారంభించిన కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం జెపి రోడ్డులోని అల్లూరి సీతారామరాజు స్మృతి వనం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.45 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన మ్యూజికల్ ఫౌంటేన్, ఫౌంటెన్సు, బ్యాక్ డ్రాప్, లైటింగ్ సదుపాయాలను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదివారం రాత్రి స్విచ్‌ఆన్ చేసి ప్రారంభించారు. ఆజాదికా అమృత్ మహోత్సవాల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం సహాయ సహకారాలతో భీమవరం అల్లూరి స్మృతి వనాన్ని ఏర్పాటు చేసుకోవడం, అనంతరం అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి, కొంత మేర పూర్తి చేయడం, పెండింగ్‌లో ఉన్న మిగతా పనుల్లో మ్యూజికల్ ఫౌంటెన్, ఫౌంటెన్సు, లైటింగ్ తదితర అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ నిరంతర పర్యవేక్షణతో సంక్రాంతి నాటికి పూర్తి చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ గతంలో ప్రధాని మోడీ అల్లూరి విగ్రహాన్ని, స్మృతి వనాన్ని ప్రారంభించారని, నూతన హంగులతో ఈ స్మృతి వనం రూపుదిద్దుకుందన్నారు. భీమవరం అభివృద్ధిలో ఇటువంటి సుందరీకరణ ఎంతో ముఖ్యమన్నారు. అలాగే భీమవరం పట్టణంలో ఇప్పటికే సుందరీకరణ పనులను, పార్కులు, ప్రముఖ కూడళ్లు, పచ్చదనం అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందని, ఇప్పటికే కొన్ని పనులు పూర్తి చేసుకోవడం, కొన్ని పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. రానున్న వేసవి నాటికి భీమవరం అభివృద్ధి కంటికి కనిపించేంత స్పష్టత వస్తుందని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో కంతేటి వెంకటరాజు, గాదిరాజు సుబ్బరాజు, సిహెచ్ కృష్ణంరాజు, డాక్టర్ రఘురామరాజు, తదితరులు పాల్గొన్నారు.


మ్యూజికల్ ఫౌంటేన్ కలెక్టర్ నాగరాణి



గంగిరెద్దులతో సందడి చేస్తున్న కలెక్టర్ నాగరాణి

కలెక్టర్ బంగ్లాలో అంబరాన్నంటిన సంబరాలు

వైభవంగా భోగి మంటలు, రంగవల్లులు, గంగిరెద్దుల ఆటలు

ప్రజాశక్తి - భీమవరం

సంక్రాంతిని పురస్కరించుకొని తొలి రోజు భోగి సందర్భంగా సోమవారం కలెక్టర్ బంగ్లాలో భోగి మంటలను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రారంభించారు. ఈ వేడుకల్లో జిల్లా ఎస్పి అద్నాన్ నయీం అస్మి, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. బంగ్లా మొత్తం రకరకాల విద్యుత్ బల్బులతో అలంకరించి, రంగవల్లులను శోభాయమానంగా తీర్చిదిద్దారు. భోగి మంటలు కనువిందు చేయగా, గంగిరెద్దులు సందడి చేశాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ అన్ని ప్రాంతాల వారు జరుపుకునే పెద్ద పండుగ సంక్రాంతి అని, ప్రతి ఒక్కరూ బంధుమిత్రులతో కలిసి ఆనందోత్సవాల మధ్య సంక్రాంతిని జరుపుకుంటున్నారు. పాతకు స్వస్తి చెప్పి నూతనత్వానికి స్వాగతం పలుకుతూ ప్రతి ఇంటి ముందు భోగి మంటలు, రంగవల్లులు భోగితో దివ్యత్వం, కళ నైపుణ్యం గోచరిస్తున్నాయన్నారు. సంక్రాంతి పండుగతో జిల్లాలోని ప్రతి ఇంటిలో సిరులు వెల్లివిరియాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పి అద్నాన్ నయీమ్ అస్మి, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల్లో భోగి సందడి

ప్రజాశక్తి - ఆచంట

సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. స్నేహితులు, ఇతర బంధువులు అంతా గ్రామాలకు రావడంతో ఉల్లాసభరితంగా భోగి పండుగను చేసుకుంటున్నారు. మహిళలు ఇంట ముంగిట రంగురంగుల రంగవల్లులు తీర్చిదిద్దారు. భోగి పండుగ సందర్భంగా ఇక్కడ ఆవు పేడతో చేసిన పిడకలను భోగిమంటలలో వేశారు. మండలంలో ఆచంట, కొడమంచిలి, కరుగోరుమిల్లి, వల్లూరు, పెనుమంచిలి, ఆచంట వేమవరం ప్రధాన కూడళ్లలో పెద్ద ఎత్తున భోగిమంటలు వేశారు. ప్రజలంతా కొత్త దుస్తులు ధరించారు. మండలంలో ప్రసిద్ధిగాంచిన శ్రీరామేశ్వరస్వామి, పెదమల్లం మాసేనమ్మ అమ్మవారి ఆలయాలు యాత్రికులతో కిటకిటలాడాయి.

ఆనందంగా ఉంది

ఉత్తమ హాస్యనటుడు గుడాల హరిబాబు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ఉత్తమ హాస్యనటుడు బహుమతి పొందినందుకు ఆనందంగా ఉందని కళాకారుడు గుడాల హరిబాబు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరవాసరం మండలంలో శ్రీకృష్ణ దేవరాయ నాటక పరిషత్ పంపిన రాష్ట్ర స్థాయి నాటిక పోటీల్లో పాలకొల్లు సమీపాన సంక్షేమ సమాఖ్య బృందం ప్రదర్శించిన అనుహ్యం నాటిక తృతీయ బహుమతిని అందుకుంది. ఈ నాటికలో ధనుష్ కోటి పాత్రలో వైవిధ్య భరితంగా నటించి, మెప్పించినందుకు ఉత్తమ హాస్య నటుడు బహుమతిని అందుకున్నాను. ఈ పాత్రకు ప్రేక్షకుల నుండి విశేష స్పందన వచ్చింది. అలాగే ఈ నాటికలో రాజేష్ పాత్ర పోషించిన శ్యాం శేఖర్కు ప్రత్యేక బహుమతి లభించింది. ఈ నాటికను తాతాబత్తుల వెంకటేశ్వరరావు రచన చేయగా కత్తుల రామ్మోహనరావు దర్శకత్వం వహించారు. ఉత్తమ హాస్యనటుడు అవార్డు అందుకున్న హరిబాబును, నాటిక బృందాన్ని క్రీడాపులోని కళాకారులు, ప్రజా ప్రతినిధులు. వివిధ కళా సంస్థల ప్రతినిధులు అభినందించారు.

భారతీయ సంస్కృతిలో పాట ఒక భాగం

ప్రజాశక్తి - ఆకివీడు


పాట భారతీయ సంస్కృతిలో ఒక భాగమని, సామాన్య వ్యక్తిని సైతం ఆకట్టుకునే రాగయుక్తమైంది పాట అని డివైఎఫ్ఐ సంక్రాంతి క్రీడోత్సవాల ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు పి.వి.ప్రతాప్‌కుమార్ అన్నారు. డివైఎఫ్ఐ 42వ సంక్రాంతి యువజనోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్థానిక పాతబస్టాండ్ సెంటర్లో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగిన జిల్లాస్థాయి పాటల, మండలస్థాయి నాట్య ప్రదర్శన పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ పాటలు ప్రతి ఒక్కరికీ వినోదం పంచి ఉండటంతో అలవడేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. అందుకు డివైఎఫ్ఐ కృషి చేస్తే తాను సహకరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ ఆహ్వాన సంఘం కార్యకర్తలు దొకల రవితేజ, షేక్ అప్పారావు, బి.రాంబాబు, అర్జి నరేష్, కె.దుర్గాప్రసాద్ పి.సురేష్, నాగార్, భరత్, గేదల ధనుష్ పాల్గొన్నారు.

ఐక్యత పెంపొందించేందుకే క్రీడలు

రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం

ప్రజల మధ్య ఐక్యత పెంపొందించేందుకే క్రీడలు నిర్వహిస్తున్నట్లు రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు చెల్లబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక చిన్నరంగడుపాలెంలో డివైఎఫ్ఐ, ఐద్వా, మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఆటలు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడారు. సంస్కృతీ సంప్రదాయాలకు నిలయంగా సంక్రాంతి పండుగ ఉందన్నారు. అయితే పండగ ముసుగులో విచ్చలవిడిగా జూద క్రీడలు నిర్వహించడం బాధాకరమన్నారు. ప్రభుత్వాలు కూడా వీటిని ప్రోత్సహించడం సిగ్గుచేటన్నారు. ఆటలు పోటీలకు సహకరించిన దాతలను ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. అనంతరం మహిళలకు ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్, పరుగుపందెం పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి చెల్ల బోయిన గోవిందు, ఆకుల వెంకటేశ్వరరావు, అన్నం రాంబాబుచేతుల మీదుగా బహుమతులు అందజేశారు.



సమావేశమైన 1998-99 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కాళ్ల: సుమారు 25 ఏళ్ల క్రితం 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి కాళ్ళ హైస్కూల్ వేదికైంది. 1998 - 99 సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సోమవారం ఒకచోట సమావేశమయ్యారు 25 ఏళ్ల కిందట కలిసి చదువుకున్న విద్యార్థులంతా ఓ చోట కలిసి పాత జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. వారి వారి పిల్లలు కుటుంబ సభ్యులతో పూర్వ విద్యార్థులు హాజరవడంతో పాఠశాల ప్రాంగణం అంతా పూర్వ విద్యార్థుల కుటుంబ సభ్యులతో నిండిపోయింది. వివిధ వత్తులు ఉద్యోగ వ్యాపారాల్లో స్థిరపడి వివిధ ప్రాంతాల్లో ఉన్న వారంతా ప్రస్తుత బిజీ షెడ్యూల్లో కూడా స్నేహ బంధమే ముఖ్యమంటూ ఓ చోట కలిసి ఉదయం నుంచి సాయంత్రం వరకూ సంతోషంగా గడిపారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేద్దామంటూ తోటి విద్యార్థులకు ఉపయోగపడతామంటూ తీర్మానాలు చేసుకున్నారు.

15న ముగ్గుల పోటీలు

నరసాపురం: పట్టణంలోని రుస్తుంబాద వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద సిఐటియు, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐల ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన ముగ్గుల పోటీలు నిర్వహించనున్నారు. శిరిగినీడి శ్రీనివాసరావు జ్ఞాపకార్థం ఈ పోటీలు నిర్వహిస్తునట్లు, మహిళలు పెద్ద ఎత్తున్న పాల్గొవాలని సిఐటియు నాయకులు సోమవారం ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో బూడిద జోగేశ్వరరావు, కోడి లక్ష్మణ్, వాసా రామలింగ పాల్గొన్నారు.

ఘనంగా డివైఎఫ్ఐ యువజనోత్సవాలు

యువతకు చుక్కానిగా.. క్రీడలకు ప్రోత్సాహకంగా 42 సంవత్సరాలుగా కృషి

ప్రజాశక్తి - ఆకివీడు

సంక్రాంతి వచ్చిందంటే చాలు ఆటలు ఎప్పుడు మొదలు అనే పరిస్థితి ఇక్కడ నాలుగు దశాబ్దాలుగా సాగుతోంది. యువతకు చుక్కానిగా ఉంటూ, చక్కటి మార్గదర్శనం చేస్తూ వారి ఆరోగ్య రక్షణకు, వారి భవితకు చక్కటి మార్గం చూపే దారిలో పయనిస్తోంది భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య ఆకివీడు శాఖ. 42 సంవత్సరాల కృషి. సంక్రాంతి సమయంలో యువత జూదం వైపు మళ్లి చెడు వ్యసనాలకు బానిస కాకుండా చూడాలన్నది ఇక్కడ వీరి ప్రధాన ధ్యేయం. అందునా సంక్రాంతి సమయంలో ఈ ప్రాంతంలో కోడిపందేలు జోరుగా ఉంటాయి. వీటిని నివారించడానికి ఈ ప్రయత్నంలో డివైఎఫ్ఐ ప్రధాన పాత్ర పోషిస్తోందని చెప్పొచ్చు. అందుకుగాను బహుముఖంగా ఉపయోగపడే క్రీడలను వీరు మార్గంగా ఎంచుకున్నారు. క్రీడలతో యువతకి సంపూర్ణ ఆరోగ్యం, ఆహ్లాదంతో పాటు గెలిచిన క్రీడాకారులకు చక్కటి సామాజిక గుర్తింపు, భవిష్యత్‌కు మార్గం ఏర్పడతాయి. అంతటితో సరిపెట్టకుండా ప్రోత్సాహకాలు కూడా అందిస్తున్నారు. ఒకరోజు ఒక పని చేయడానికే కష్టం అనిపించే ఈ రోజుల్లో నాలుగు దశాబ్దాలపైబడి ఈ కృషి సాగిస్తున్నారు. ఆర్థిక, శారీరక, మానసిక, సాంఘిక సమస్యలను ఎదుర్కొంటూ స్థలాభావం కూడా ప్రధాన సమస్యగా ఉన్నప్పటికీ కర్తవ్య దీక్షతో ముందుకు సాగుతోంది డివైఎఫ్ఐ. మొదట్లో ఆర్థిక సమస్య తీవ్రంగా ఉండేది. కార్యకర్తలు తమకు అందుబాటులో ఉన్న మేరకు ఈ కార్యక్రమాలు నిర్వహించేవారు. అయితే రాను రాను స్థానికులు సహకరించడం, వితరణ శీలురు ముందుకు రావడంతో క్రీడల స్థాయి పెరిగింది. అందులో భాగంగా రాష్ట్రంలో అనేక రకాలుగా అగ్రస్థానంలో నిలబడి బంగారు, రజిత, కాంస్య పతకాలు సాధించిన క్రీడాకారులను వారికి అదనపు పారితోషకం చెల్లించి, తీసుకువచ్చి ఇక్కడ ఆడించేవారు. అయితే ఇంతటితో సంతృప్తి చెందని సంస్థ స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వాలని యోచించింది. ఆ క్రమంలో భాగంగా జిల్లాలోనూ, రాష్ట్రంలోనూ ఉన్నటువంటి సాధారణ క్రీడాకారులను సైతం ఆహ్వానించింది. పారితోషికాలు చెల్లించి తీసుకురావడం కన్నా సాధారణ క్రీడాకారులను ప్రోత్సహించడం కూడా మంచి ఫలితాలు ఇచ్చిందని చెప్పచ్చు. ఇక్కడ వేదికగా క్రీడల్లో రాణించిన అనేకమంది రాష్ట్ర, జాతీయ స్థాయిలో సైతం రాణించి మరింత పైకి ఎదిగారు. వీరిలో విద్యార్థులు ఉన్న యువత జాతీయ స్థాయి క్రీడల్లో సైతం పాల్గొనడం విశేషం. అంతటి ఉన్నత క్రీడాస్థాయికి వేదికగా ఆకివీడు ఎదిగింది. ఒక చెడుగుడితో ఆగకుండా వాలీబాల్, చెస్, క్రికెట్ పోటీలు సైతం సుమారు దశాబ్దం క్రితం ప్రారంభించారు. అక్కడికి ఆగలేదు, క్రమంగా ఈ పోటీలలో ఆటలతో పాటు పాటలను కూడా చేర్చారు. మొదట్లో స్థానికంగా నాలుగు టీంలతో ప్రారంభించిన చెడుగుడు పోటీలు నేడు 4 రకాల క్రీడలకు పెంచారు. గత రెండు సంవత్సరాల నుంచి ప్రత్యేకంగా మహిళా క్రీడలు కూడా నిర్వహించడం ఇక్కడ ఆకట్టుకునే అంశం. ఇదే దశలో వీరికి అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య (ఐద్వా) తోడైంది. ముగ్గులు(రంగవల్లులు), మ్యూజికల్ చైర్స్ పోటీలను ప్రత్యేకంగా నిర్వహించడం మొదలుపెట్టింది. ఇక చెప్పేదేముంది శోభంత ఈ క్రీడలకు సొంతం. ఈ ప్రాంతంలో జూదాలు ఏ స్థాయిలో ఉన్న క్రీడలు అంతకుమించి స్థాయిలో జరుగుతున్నాయి. ఈ క్రీడల కోసం సుమారు 200 మంది యువత రెండు నెలలు కష్టించి పనిచేస్తారు. నిధుల సేకరణ, కరపత్రాల పంపిణీ, క్రీడా ప్రాంగణం మరమ్మతులు, క్రీడాకారులకు ఆహ్వానం పంపడం వంటి అనేక కార్యక్రమాలు ఎంతో కష్టసాధ్యంతో నెరవేరుస్తారు. ఇంతటి వ్యయ ప్రయాసలతో క్రీడల నిర్వహణకు ఒక ఎత్తు అయితే ఇక ప్రేక్షకులు అందునా పండుగ రోజుల్లో రావడం మరింత విశేషం. ఈ పరిసరాల్లో ఉన్న క్రీడాభిమానులు సాంస్కృతిక, సామాజిక అభిమానులకు పండగ ఇక్కడే అయిపోవడం గమనార్హం. ఇంతటి విశేషం కలిగిన క్రీడలు ఈ సంవత్సరం జనవరి 8వ తేదీ నుంచి ప్రారంభమయ్యాయి. ఆరోజున క్రికెట్ ప్రారంభమైనప్పటికీ 13వ తేదీ నుంచి పూర్తిస్థాయి క్రీడా సంబరాలు ప్రారంభమవుతున్నాయి. 16వ తేదీ వరకు జరిగే ఈ క్రీడలకు రాష్ట్ర నలుమూలల నుంచి క్రీడాకారులు పాల్గొననున్నారు. ఈ క్రీడల నిర్వహణతో ఆగకుండా సమాఖ్య క్రీడాల నిర్వహణకు శాశ్వత పథకంగా ఆకివీడులో మినీ స్టేడియం నిర్మించాలని వీరి ఉద్యమ క్రమం.



డివైఎఫ్ఐ యువజనోత్సవాలకు చేస్తున్న ఏర్పాట్లు

కాలు దువ్విన కోడి..!

ప్రజాశక్తి - యలమంచిలి

మండలవ్యాప్తంగా కోడి పందేలు, గుండాట, ఇతర జూదాలు యథేచ్ఛగా ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం ఎనిమిది గంటలకే కలగంపూడి, యలమంచిలి, కాజ, కొంతేరు, మేడపాడు, నార్నిమెరక, మట్లపాలెం, గుంపర్రు, బూరుగుపల్లి, కనకాయలంక, పెదలంక తదితర గ్రామాల్లో కోడి పందేలు సాగాయి. తెలంగాణ, బెంగళూరు, చెన్నయ్ తదితర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో జనం తరలొచ్చారు. కలగంపూడిలో జాతీయ రహదారికి ఆనుకుని, యలమంచిలిలో ప్రధాన రహదారి చెంతనే బరులు నిర్వహించడం వల్ల గంటలు తరబడి ట్రాఫిక్ స్తంభించి జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



వీరవాసరంలో కోడిపందేలు నిర్వహణ

కాళ్ల: సంక్రాతి సంబరాలను పెదఅమిరంలో బొమ్మల కొలువు, గంగిరెద్దుల ఆటలు, సంప్రదాయ కోళ్ల పోటీలను డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్‌ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు సోమవారం ప్రారంభించారు. పెదఅమిరం, సీసలిల్లో భారీ బరులు, జక్కరం, ఏలూరుపాడు, జువ్వలపాలెం, కాళ్ళ, మాలవానితిప్ప గ్రామాల్లో కోడి పందేలు సాగాయి. తొలుత కొద్దిసేపు కత్తులు కట్టకుండా పందేలను వేశారు. డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు డింకీ పందేల పేరిట కోళ్లను బరిలోకి వదిలారు. ఉండి మాజీ ఎంఎల్‌ఎ మంతెన రామరాజు సీసలిలో పందేలను తిలకించారు. నిన్నటి వరకూ పందేలకు అడ్డుకట్ట వేస్తామంటూ చెప్పిన పోలీసు, రెవెన్యూ ఉన్నతాధికారులు సోమవారం మౌనముద్ర వహించారు.

తాడేపల్లిగూడెం: మండలంలో కోడి పందేల జోరు సాగింది. కడియద్ద, వెంకటరామన్నగూడెం, పెద్ద తాడేపల్లి, కొమ్ముగూడెం, బంగారుగూడెం ప్రాంతాల్లో ప్రాంతాలలో కోడి పందాలు బర్లి వేసే ప్రాంతాలను పోలీసులు జెసిబి లతో ధ్వంసం చేసినప్పటికీ సోమవారం తాడేపల్లిగూడెం మండలం కడియద్ద గ్రామంలో కోడిపందాలు నిర్వహికులు టెంట్లు వేసి మరి కోడి పందాలు నిర్వహించారు.

ఆకివీడు: మండలంలో అన్ని గ్రామాల్లోనూ కోడి పందేలు సాగాయి. మండల కేంద్రం ఆకివీడులో భారీ బరి ఏర్పాటు చేశారు. ఆ బరిలోకి అనుమతి ఉన్నవారినే లోపలికి వెళ్లనిచ్చారు. ప్రతిచోటా భారీ స్థాయిలో స్క్రీన్లు ఏర్పాటు చేశారు.

తణుకు రూరల్: మండలంలోని తేతలి, దువ్వ, మండపాక, వేల్పూరు గ్రామాల్లో ఏర్పాటు చేసిన బరుల్లో కోడిపందేలు జోరుగా సాగాయి. వీటిని తిలకించేందుకు ఇతర రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో ప్రముఖులు తరలొచ్చారు. కొన్ని బరుల్లో పందేలు చూసేవారి కోసం భోజన ఏర్పాట్లు సైతం ఉండటం గమనార్హం. తేతలిలో అధికార పార్టీకి సంబంధించిన బరిలో జోరుగా పందేలు కొనసాగాయి. తేతలిలో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అనుచరుడు కోట నాగేశ్వరరావు ఏర్పాటు చేసిన బరిని పోలీసులు సాయంత్రం వరకు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, నిర్వాహకులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది.

వైసిపి బరుల నిలుపుదల

ఇరగవరం మండలం కొత్తపాడు, కె.ఇల్లింద్రపర్రు గ్రామాల్లో వైసిపికి చెందిన వారు ఏర్పాటు చేసిన బరులను పోలీసులు అడ్డుకున్నారు. కొత్తపాడులో పోలీసుల తీరును నిరసిస్తూ మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు రోడ్డుపై బైఠాయించడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది.

ఆచంట: మండలంలో ఆచంట, వల్లూరు గ్రామాల్లో కూటమి నాయకుల పర్యవేక్షణలో కోడిపందేలు పెద్దఎత్తున సాగాయి. రాత్రి సమయంలో ఫ్లడ్‌లైట్ల వెలుగులో పందేలు నిర్వహించడం గమనార్హం.

గణపవరం: మండలంలో కోడిపందేలు పెద్దఎత్తున సాగాయి. గణపవరం, కేశవరం, చిలకంపాడు, కాశిపాడు, మొయ్యేరు, అప్పన్నపేట, జల్లికాకినాడ గ్రామాల్లో పందేలు సాగాయి.

వీరవాసరం: మండలంలో వివిధ గ్రామాల్లో యథేచ్ఛగా కోడిపందేలు నిర్వహించారు. గతానికి భిన్నంగా నవుడూరు, వీరవాసరంల్లో కూటమి నేతలు పందేలు, గుండాట నిర్వహించారు. బౌన్సర్లను కాపాలా పెట్టి కొన్ని బరుల వద్ద సాధారణ ప్రజానీకాన్ని రాకుండా అడ్డుకున్న పరిస్థితి ఉంది. రోడ్డు మార్జిన్ల వెంబడి మోటార్ సైకిళ్లు నిలిపివేయడంతో రాకపోకలు ఇబ్బందులు ఎదురవుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదంటూ వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రముఖ సామాజిక సేవకులు మళ్ల రాంబాబు సంక్రాంతిని జాతరగా నిర్వహించారు. జాతరకు వచ్చే వారికి అందరికీ మూడు రోజులు భోజనాలు ఏర్పాటు చేశారు.

భీమవరంటౌన్: భీమవరం పరిధిలో నరసింహపురం, తాడేరు, తుందుర్రు, బర్రివానిపేట, నాగేంద్రపురం, అనాకోడేరు గ్రామాలతోపాటు పలు ప్రాంతాల్లో జోరుగా కోడి పందేలు సాగాయి. గుండాట, కోతాట, కలర్స్‌తోపాటు ప్రత్యేకంగా మందు షాపులు, చికెన్ పకోడీలు, బిర్యానీ సెంటర్లు పెద్దఎత్తున ఏర్పాటు చేశారు.

నరసాపురం : సోమవారం పట్టణం, మండలంలో కోడి పందేలు భారీగా జరిగాయి. లక్షలాది రూపాయలు చేతులు మారాయి. పట్టణంలోని వీవర్స్ కాలనీ ,ప్రభుత్వ ఆసుపత్రి వెనుక బరులు వద్ద పెద్ద ఎత్తున రద్దీగా కనిపించాయి. కోడిపందేలు చూసేందుకు లైవ్ స్క్రీన్, బౌన్సర్లను ఏర్పాటు చేశారు. మండలంలోని కొప్పరు గ్రామంలో బరిని జనసేన నాయకుడు పోలిశెట్టి శ్రీనివాస్, పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వెనుక బరిని జనసేన రాష్ట్ర కార్యదర్శి చాగంటి మురళీకృష్ణ (చిన్నా) పోటీలను ప్రారంభించారు. పట్టణంలోని 216 జాతీయ రహదారి ఆనుకుని గుండాట బోర్డులు ఏర్పాటు చేశారు.



యలమంచిలిలో..

ఘనంగా సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - కాళ్ల

సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా సంక్రాంతి సంబరాలు నిర్వహించడం అభినందనీయమని ఎపిఐఐసి ఛైర్మన్, మాజీ ఎంఎల్‌ఎ మంతెన రామరాజు అన్నారు. సోమవారం ఏలూరుపాడులో అల్లూరి సీతారామరాజు ట్రస్ట్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి అంటే ఏంటో విద్యార్థులకు తెలియజేసే విధంగా హరికథలు, గంగిరెద్దుల విన్యాసం, గాలిపటాలు ఇలా పలు రకాల సెట్స్ ఏర్పాటు చేశారు. సంక్రాంతిని తెలియజేసేలా ముగ్గుల రూపంలో వేశారు. ముగ్గుల పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన వారికి బహుమతులను మంతెన రామరాజు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి భూపతిరాజు వెంకట జగ్గరాజు, మాజీ సర్పంచి మంతెన ఆంజనేయరాజు, కమిటీ సభ్యులు దాట్ల రామకృష్ణంరాజు, దాట్ల శ్రీనివాసరాజు, సెక్యూరిటీ వాసు, కలిదిండి అప్పలరాజు, క్షత్రియ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

తణుకు: తణుకు నియోజకవర్గ ప్రజలందరికీ శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ఎంఎల్‌ఎ నివాసం వద్ద రాధాకృష్ణ దంపతులు, కూటమి నాయకులతో కలిసి భోగిమంటలు వేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ ఈ భోగి పండుగ ప్రజలందరి జీవితాల్లో కొత్త వెలుగులు తేవాలని శుభాక్షాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నరసాపురం : దుస్తుల పంపిణీ చేస్తున్న వాసవి క్లబ్ సభ్యులు

తాడేపల్లిగూడెం: భోగి సందర్భంగా స్థానిక ఎయిర్ స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు తిరుమళ్ల సూరిబాబు ఆధ్వర్యంలో సాంప్రదాయ రీతిలో భోగి పండుగను ఘనంగా నిర్వహించారు. వాకర్స్ కుటుంబ సభ్యులు అందరూ సాంప్రదాయ దుస్తుల్లో హాజరై కనువిందు చేశారు. కూచిపూడి వెంకట అనిల్ కుమార్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి అల్లూరి శ్రీనివాస్, పూర్వ జిల్లా గవర్నర్ కప్పల నరసింహమూర్తి, పూర్వ అధ్యక్షులు బాకా వెంకటేశ్వరరావు, వనచర్ల నాగేంద్రప్రసాద్, పప్పొప్పుల కుమారస్వామి, డాక్టర్ కంచర్ల పృథ్వీ, మాకా శ్రీనివాసరావు, కడియాల పరశురామయ్య, బుచ్చిరెడ్డి, కంచర్ల లక్ష్మీ నరసింహం, యోగా గురు బడుగు చంద్రశేఖర్ పాల్గొన్నారు. హరిదాసు వేష ధారణలో కోపల్లె శ్రీనివాస్ అందరినీ అలరించారు.


నరసాపురం : వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని అప్పన్న ప్లాజా వద్ద సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా భోగి మంటలు, గాలిపటాలు ఎగుర వేశారు. అనంతరం వాసవి క్లబ్ మెంబర్ గాదె ప్రకాశరావు ఆర్థిక సహాయంతో పేద వారికి దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ నూలి శ్రీనివాస్, సెక్రటరీ కె.బాబ్జి, ట్రెజరరీ కె.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేలు నిర్వహించొద్దు

సిపిఎం ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి - తణుకు

చట్ట విరుద్ధమైన కోడి పందేలు, జూదం, గుండాట వంటి వాటి వల్ల పేద, మధ్యతరగతి ప్రజల జీవితాలు ఆర్థికంగా అప్పుల పాలౌతున్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పివి ప్రతాప్ అన్నారు. సోమవారం సంక్రాంతి పేరుతో చట్ట విరుద్ధమైన కోడి పందాలు, జూదం, గుండాట వంటివి ఆపాలని సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ జిల్లా పోలీస్ అధికారులు కోడిపందేలు జరగనివ్వబోమని ఏటా చెప్పడం తప్ప ఆచరణలో చెప్పినంతగా ఏమీ లేదని విమర్శించారు. అధికారులు ఇవి చూసి కూడా చూడనట్టు వ్యవహరించడం వల్ల పేదలు మరింత అప్పుల ఊబిలోకి పోతున్నారన్నారు. పండుగ తరువాత చాలా మంది డబ్బులు పోగొట్టుకుని ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి అడ్డగర్ల అజయకుమారి, గార రంగారావు, గోవింద్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సిపిఎం నేతలు

జూదం వద్దు క్రీడలే ముద్దు

ప్రజాశక్తి - ఆచంట

సంక్రాంతి సందర్భంగా మండలంలో పలుచోట్ల క్రీడలు నిర్వహించడంతో యువత జూదం వైపు వెళ్లకుండా కాస్త కట్టడి చేయడం ఊరటనిచ్చింది. మండలంలోని కొడమంచిలి, ఆచంట వల్లూరు, ఆచంట వేమవరం గ్రామాల్లో మూడు రోజులపాటు ఆటలు పోటీలు కొనసాగనున్నాయి. గ్రామాల్లో యువత విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా పలువురు యువకులు కోడిపందేలు, జూదం కంటే క్రీడలే ముద్దు యువత జూదం వైపు అడుగు వేయవద్దని సూచిస్తున్నారు. కోడిపందేలు పేకాట, గుండాట వల్ల భవిష్యత్ అంధకారంగా మారుతుందని పలువురు తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా యువత, విద్యార్థులు, మహిళలకు జోష్ అందించారు. కొడమంచిలి, ఆచంట, ఆచంట వేమవరం గ్రామాల్లో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో సంక్రాంతి ఆట పోటీలకు శ్రీకారం చుట్టారు. పండుగ సందర్భంగా యువత చెడువ్యసనాల వైపు వెళ్లకుండా చేయాలని ఆలోచనతో పాఠశాల పూర్వ విద్యార్థులు గ్రామ పెద్దలు మూడు రోజులపాటు ఆటలు పోటీలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా కొడమంచిలిలో పూర్వ విద్యార్థుల సౌకర్యార్థం సైకిల్ షెడ్యూల్ ఏర్పాటు చేశారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందజేత

ప్రజాశక్తి - పెనుగొండ

మండలం వడలి గ్రామ పంచాయతీ వద్ద సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పంచాయతీ సర్పంచి కాసాని విజయలక్ష్మి, వార్డు సభ్యుల ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు, మంచినీటి సరఫరా, ఎలక్ట్రికల్ సిబ్బందికి దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచి విజయలక్ష్మి మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులే గ్రామ ప్రజల ఆరోగ్యానికి మూల స్తంభాలన్నారు. గ్రామస్తులకు భోగి, మకర సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చలుమూరి పార్వతి, కార్యదర్శి కె.శ్రీనివాస రెడ్డి, గణేశ్వరరావు పాల్గొన్నారు.

గణపవరం : గణపవరం పారిశుధ్య కార్మికులకు సోమవారం దుస్తులను గ్రామ సర్పంచి మూరా అలంకారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి డిఎస్ఆర్.ప్రసాద్, పాలక వర్గ సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడు అరెస్ట్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

బెల్టుషాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఇ.స్వరాజ్య లక్ష్మి తెలిపారు. పెంటపాడు మండలం అలంపురం గ్రామంలో దాబా వద్ద బెల్ట్ షాపు నిర్వహిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుండి 9 మద్యం సీసాలను స్వాధీన పర్చుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో తాడేపల్లిగూడెం ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ మురళీమోహన్, దొరబాబు సిబ్బంది పాల్గొన్నారు.

మనవడిని హత్య చేసిన తాత అరెస్టు

ప్రజాశక్తి - నరసాపురం

వీరవాసరం మండలం మత్స్యపురి గ్రామంలో మద్యం మత్తులో మనవడు చింతా నాగరాజును హత్య చేసిన తాత చింతా ఆదినారాయణను సోమవారం అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్ఐ టి. వెంకట సురేష్ తెలిపారు. శనివారం రాత్రి మద్యం తాగి తాత మనవడు మిగిలి ఉన్న మద్యం బాటిల్ కోసం గొడవపడ్డారు. ఈ వివాదంలో తాత మనవడి కత్తితో పొడిచి చంపిన విషయం విదితమే. సోమవారం ఆదినారాయణను అరెస్టు చేసి న్యాయమూర్తి కె.శ్రీనివాస్ ముందు పర్చగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మొగల్తూరు : మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో జాతీయ రహదారిపై సోమవారం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం స్థానికులు భీమవరంలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు.